
సాక్షి సిద్దిపేట

శనివారం । 28 । జూన్ । 2025



ఆత్మహత్యలు వద్దు..
చిన్న చిన్న విషయాలకే జీవితాలను చిదిమేసుకుంటున్నారు. కన్నవారికి కన్నీళ్లు మిగులుస్తున్నారు.
వివరాలు 8లో ▸



కార్పొరేట్ల కోసమే ఎన్‌కౌంటర్లు
కార్పొరేట్ కంపెనీల కోసమే బీజేపీ ప్రభుత్వం నక్సలైట్లను హతమారుస్తుందని సీపీఐ ఆరోపించింది.
వివరాలు 8లో ▸

మున్సిపల్ రెవెన్యూ అధికారి బదిలీ

సిద్దిపేటజోన్: మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీకాంత్‌ను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శ్రీకాంత్‌ను తూప్రాన్ మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ.. ఆదేవిధంగా రామాయంపేట మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌ను సిద్దిపేటకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

న్యూస్‌రీల్

పీజీ ఎంట్రెన్స్‌కు ఉచిత కోచింగ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత

సిద్దిపేటఎడ్యుకేషన్: కెమిస్ట్రీ సబ్జెక్ట్‌తో పీజీ పూర్తి చేసిన అభ్యర్థులకు ఫార్మా రంగంలో మంచి అవకాశాలున్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో కెమిస్ట్రీ పీజీ ఎంట్రెన్స్ రాయనున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్‌లు మాట్లాడారు. పీజీలో కెమిస్ట్రీని ఎంచుకుని, శిక్షణా తరగతులను ఉపయోగించుకుని వివిధ యూనివర్సిటీల్లో పీజీ ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. పీజీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి ఫలితాలను సాధించాలన్నారు. ఉచిత శిక్షణపై ఆసక్తిగల విద్యార్థులు కన్వీనర్ డాక్టర్ మనోహర్‌ను కలిసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, సీఓఈ డాక్టర్ గోపాలసుదర్శనం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈనెలాఖరు వరకు బియ్యం పంపిణీ

సిద్దిపేటరూరల్: రేషన్ బియ్యాన్ని ఈనెల 30వ తేదీవరకు అందించనున్నట్లు అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ తీసుకోని లబ్ధిదారులు వెంటనే అందుబాటులో రేషన్ షాప్‌నకు వెళ్లి తీసుకెళ్లాలన్నారు. పూర్తి స్థాయిలో బియ్యం అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 90 శాతం పంపిణీ పూర్తయిందని, మొత్తంగా 2,98,985 రేషన్‌కార్డులు ఉండగా, నేటికి 2,67,875 కార్డుదారులకు 16,739 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అక్రమలకు తావివ్వకుండా బియ్యం పంపిణీ చేయాలన్నారు.

యాక్టివాపై సుదీర్ఘ ప్రయాణం



శివకుమార్‌ను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేటజోన్: యాక్టివా బైక్‌తో 6300 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం చేసిన సిద్దిపేట యువకుడిని శుక్రవారం వాసవీ క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. స్థానిక శివాజీనగర్‌కు చెందిన శివకుమార్ 23 రోజుల పాటు ద్విచక్ర వాహనంపై లడక్ వరకు పర్యటించి తిరిగి వచ్చాడు. ఈ సందర్భంగా శివకుమార్‌ను పట్టణ వాసవీ క్లబ్ ప్రతినిధులు నవీన్ కుమార్, శివకుమార్ హరికిరణ్, మంజుల, ధనలక్ష్మి ఘనంగా సన్మానించారు.

బడుల తనిఖీకి ప్రత్యేక యంత్రాంగం



మాట్లాడుతున్న జ్ఞానమంజరి

నారాయణఖేడ్: పాఠశాలల తనిఖీకోసం ప్రత్యేక యంత్రాగాన్ని ఏర్పాటు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి డిమాండ్ చేశారు. ఖేడ్‌లో శనివారం నిర్వహించిన సంఘం డివిజన్‌స్థాయి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులను పర్యవేక్షణ కోసం వినియోగించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పర్యవేక్షణ కోసం డీఈఓ, డిప్యూటీ ఈవో, ఎంఈవో, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను వినియోగించుకోవాలని, అవసరమైనచోట్ల కొన్ని అదనపు పోస్టులను మంజూరు చేసి ప్రత్యేక యంత్రాంగం ద్వారానే పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియమిస్తే క్యాడర్, సీనియారిటీ సమస్యలతోపాటు విద్యార్థులకు నష్టం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు అశోక్, కార్యదర్శులు నరేశ్, ఏశప్ప, హరిసింగ్, ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించాలని ఇంఫాక్ట్ ప్రాజెక్టు టీబీ అలర్టు ఇండియా ప్రతినిధి శ్రీనివాస్ సూచించారు. పట్టణంలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. దగ్గు, తుమ్ములు వచ్చినప్పుడు బ్యాక్టీరియా గాలిలో కలిసి మరొకరికి ఈ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధి ఊపిరితిత్తులను ప్రభావితం చేసి, శరీరంలోని ఇతర భాగాలపై కూడా ప్రభావం చూపిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో తెలంగాణ గీతం ఆలపిస్తుండగా లేచినిలబడిన మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి, దామోదర, తుమ్మల చిత్రంలో కలెక్టర్ తదితరులు

అండగా ఉంటాం.. అభివృద్ధి చేస్తాం

హుస్నాబాద్‌లో ప్రగతిని పరుగులు పెట్టిస్తాం

- 50 పడకల పీజీ మెడికల్ కళాశాల: మంత్రి దామోదర
- త్వరలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తాం: మంత్రి తుమ్మల
- పది రోజుల్లో నాలుగు లేన్ల రహదారి మంజూరు: మంత్రి వెంకట్‌రెడ్డి
- పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం

హుస్నాబాద్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని మంత్రులు దామోదర, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం రూ.11.50కోట్లతో నిర్మించిన మాతా శిశు సంరక్షణ ఆరోగ్యం కేంద్రం ప్రారంభం, రూ.82 కోట్లతో 150 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన, రూ.72.20 కోట్లతో హుస్నాబాద్ నుంచి కొత్త పల్లి వరకు (ఫేజ్-2) నాలుగు లేన్ల రోడ్ల నిర్మాణానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులు కలిసి శంకుస్థాపన చేశారు. హుస్నాబాద్ చరిత్రలోనే ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఇదే మొదటి సారి.

విద్య, ఆరోగ్యంతోనే సమాజంలో మార్పు

ఆరోగ్య తెలంగాణ సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో దామోదర మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే విద్య, ఆరోగ్యం, నైపుణ్యం అవసరమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ వల్లే హుస్నాబాద్‌కు ఇంజనీరింగ్ కళాశాల వచ్చిందన్నారు. హుస్నాబాద్ 250 పడకల ఆస్పత్రికి 50 సీట్లతో పీజీ మెడికల్ కళాశాలను మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. ఎంబీబీఎస్ కాదని పీజీ చదువుకునే డాక్టర్లు ఇక్కడికి వస్తారని ఇది చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రతి నియోజకవరానికి ఒక నర్సింగ్ కళాశాల అవసరమన్నారు.

త్వరలో నాలుగు లేన్ల రోడ్డు: మంత్రి పొన్నం

అక్కన్నపేట నుంచి జనగామ వరకు నాలుగు లేన్ల రోడ్డు త్వరలో వస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల సహకారంలో ఇంజనీరింగ్ కళాశాల ఈ ఏడాది నుంచే ప్రారంభం అవుతుందని తెలిపారు. ఇక్కడికి వచ్చిన మంత్రులు హుస్నాబాద్ అభివృద్ధికి అభయం ఇవ్వాలని కోరారు. మూడు జిల్లాల కలెక్టర్లు కలిసి గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల పనుల సర్వే చేస్తున్నారని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు రూ.71.30 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. హుస్నాబాద్‌లో గోడౌన్‌లు నిర్మించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు, సుందరగిరి నుంచి కొత్తపల్లి వరకు ఫేజ్ వన్ నాలుగు వరుసల రహదారిని మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డికి మంత్రి పొన్నం వినతి పత్రాలు ఇచ్చారు.

పొన్నంను పొగడ్తలతో ముంచెత్తిన మంత్రులు

మంత్రి పొన్నంపై సహచర మంత్రులు ప్రశంసల వర్షం కురిపించారు. మంత్రుల మాటలు ఇలా.. 'పొన్నం ప్రభాకర్ తెలంగాణ ఉద్యమకారుడు. చాలా యాక్టివ్ మంత్రి. ఎప్పుడూ హుస్నాబాద్ కోసం పరితపిస్తుంటారు. ఉదయం హైదరాబాద్‌లో ఉంటే సాయంత్రం హుస్నాబాద్‌లో ఉంటారు. హుస్నాబాద్‌లో ఇంకా అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేవి చాలా ఉన్నాయి. మేమంతా అండగా ఉంటాం. అభివృద్ధి చేస్తాం. రాబోయే మూడున్నరేళ్లలో పొన్నం అడిగిన పనులు పూర్తి అవుతాయి' అని అన్నారు.

'గౌరవెల్లి'పై గత ప్రభుత్వం నిర్లక్ష్యం: మంత్రి కోమటి రెడ్డి



పొన్నం వినతి పత్రం ఇస్తుండగా చిరునవ్వుతో స్వీకరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రూ.77కోట్లతో హుస్నాబాద్ నుంచి సుందరగిరి వరకు నాలుగు వరసల రోడ్డు ఫేజ్ టూ కింద రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. సుందరగిరి నుంచి కొత్తపల్లి వరకు రూ.80 కోట్లతో నాలుగు వరుసల రహదారి వారం రోజుల్లో మంజూరు అవుతుందని అన్నారు. గత ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కోసం సీఎంతో మాట్లాడామన్నారు. ఫారెస్ట్ అనుమతులు పూర్తి అయ్యాయని, కాలువల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

ప్రతీ జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ: తుమ్మల

శ్రీరాంసాగర్, వరద కాలువలతో అన్నపూర్ణ జిల్లా కరీంనగర్ జిల్లా ప్రసిద్ధి చెందుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ఎన్నో ప్రాజెక్టులు ఉన్న కరీంనగర్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా వచ్చానన్నారు. నర్మేటలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరిని త్వరలో సీఎం ప్రారంభిస్తామన్నారు. నాలుగైదు జిల్లాలకు ఈ ఫ్యాక్టరి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి జిల్లాలో ఆ యిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు నష్టం ఉండదని, స్థిరత్వమైన ధర కల్పిస్తామన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం



మంత్రులకు బైక్ ర్యాలీతో స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

హుస్నాబాద్‌లో మంత్రులకు కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీగా కిలోమీటర్ల మేర తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. రోడన్నీ పార్టీ కార్యకర్తల జోష్‌తో నిండిపోయింది. పబ్లిక్ మీటింగ్‌కు మహిళలు భారీగా తరలివచ్చారు. కాగా సమావేశంలో సాంస్కృతిక కళాకారులు సంక్షేమం, అభివృద్ధిపై ఆటపాటలతో ప్రజలను ఉత్తేజపరిచారు. కానీ సయ్యాటల పాటలు పాడటంతో మహిళలు ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఆగస్టులో ప్రారంభిస్తాం



మ్యాప్ ద్వారా ఫ్యాక్టరీ పనులను పరిశీలిస్తున్న మంత్రులు నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్

- ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాం
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- ఫ్యాక్టరీని ఆకస్మికంగా పరిశీలించిన మంత్రులు

నంగునూరు(సిద్దిపేట): రాష్ట్రంలోనే అత్యంత కెపాసిటీ కల్గిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని వ్యవశాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. ఆగస్టు మొదటి వారంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. శుక్రవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలసి తుమ్మల నంగునూరు మండలం నర్మేటలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణం పనులపై ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం, సాగు చేస్తున్న రైతుల వివరాలు, ఫ్యాక్టరీ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. చుట్టుపక్కల నాలుగు జిల్లాల నుంచి ఆయిల్‌పామ్ గింజలను సేకరించి ప్యాకింగ్ ఇక్కడే చేస్తారని ముగ్గురు మంత్రులకు వ్యవసాయ మంత్రి వివరించారు. అనంతరం మాట్లాడుతూ నర్మేటలో నిర్మిస్తున ఫ్యాక్టరీ 120 టన్నుల కెపాసిటీ కలిగి ఉందన్నారు. తెలంగాణకు గుండె కాయలా ఉన్న ఈప్రాంతంలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీని ప్రతిష్టాత్మకంగా నిలుస్తుందన్నారు. రిఫైనరీ కోసం త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. నాడు గ్రౌండ్ లేవల్‌లో ఉన్న పనులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న నర్సారెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి
- గజ్వేల్‌లో ఇళ్ల పనులు ప్రారంభం

గజ్వేల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 2, 13వార్డుల్లో లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గానికి ప్రభుత్వం 3వేల ఇళ్లు మంజూరుచేసిందని చెప్పారు. ఇప్పటికే 2,938మందికి ప్రొసీడింగ్‌లను సైతం అందజేశామన్నారు. నియోజకవర్గానికి అదనపు ఇళ్లు కావాలన్నా.. ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం మంజూరైన ఇళ్లను ఆరు నెలల్లో పూర్తి చేసి పండుగ వాతావరణంలో గృహప్రవేశాలు పూర్తి చేయాలని కోరారు. ప్రజాప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా పక్కా ప్రణాళికతో ముందుకుసాగుతున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లల్లా భావించి సీఎం రేవంత్‌రెడ్డి ముందుకుసాగుతున్నారని కొనియాడారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 9రోజుల్లో 9వేల కోట్లు రైతు భరోసా నిధులను జమ చేసినట్లు చెప్పారు. సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసీ ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు సమీర్ పాల్గొన్నారు.

అవార్డుతో మరింత బాధ్యత పెరిగింది

ఉత్తమ డీఐఈఓగా రవీందర్‌రెడ్డి



డీఐఈఓ రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న గెస్ట్ లెక్చరర్లు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఉత్తమ అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణ, బోర్డు డైరెక్టర్ కృష్ణఆదిత్య నుంచి రవీందర్‌రెడ్డి ఉత్తమ డీఐఈఓ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో గెస్ట్ లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, జిల్లాలో ఇంటర్ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు తన శక్తిమేరకు కృషి చేస్తానన్నారు. గెస్ట్ లెక్చరర్ల సమస్యలు ఈ నెల 30లోగా పరిష్కరిస్తానన్నారు. అధ్యాపకులు నిబద్ధతతో పనిచేయాలని, విద్యార్థుల భవిష్యత్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దుతూ మంచి ఫలితాలను సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అధ్యాపకులు తమ సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందకు ప్రయత్నిస్తానని చెప్పారు. ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పరస్పర సహకారంతో కళాశాలల్లో చక్కని వాతావరణం నెలకొనేలా కృషిచేయాలని కోరారు. సెక్రటరీ సూచన మేరకు గెస్ట్ లెక్చరర్ల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్-2152 రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవయ్య, జిల్లా ఇన్‌చార్జి మల్లికార్జున్‌శర్మ, జిల్లా సెక్రటరీ చంద్రమోహన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీలో 95.90శాతం ఉత్తీర్ణత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలలో 95.90శాతం ఉత్తీర్ణత నమోదు అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 3 నుంచి 13 వరకు నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1146 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇందులో 1099 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని డీఈఓ తెలిపారు.

కాలువ కాదు.. రోడ్డే

బెజ్జంకి మండలంలోని బేగంపేట-వడ్లూరు రోడ్డుపై నీరు చేరి కాలువను తలపిస్తోంది. ఇటీవల రోడ్డు వెడల్పు పనుల కోసం ఇరువైపులా పోసిన మట్టి కుప్పలను చదును చేయకపోవడంతో కురిసిన వర్షానికి వరద చేరింది. బెజ్జంకి రావడానికి ఇదే ప్రధాన రోడ్డు మర్గం. మరోవైపు వ్యవసాయ పనుల కోసం వెళ్లే వాహనదారులు సైతం రోడ్డుపై ప్రయాణించడానికి జంకుతున్నారు. తాత్కాలికంగానైనా నీటిని తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

– బెజ్జంకి(సిద్దిపేట)



బెగంపేట-వడ్లూరు రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

పౌష్టికాహారం అందేలా చర్యలు

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): జిల్లాలోని వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మిరుదొడ్డిలోని కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం), మోడల్ స్కూల్ హాస్టల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. హాస్టల్‌లోని వంట గదులను, స్టోర్ రూంలను పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందించారా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అలాగే హాస్టల్‌లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కరమైన వాతావరణంలో విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించాలని టీచర్లకు సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి టీచర్లు మంచి ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని ఆదేశించారు. టెన్త్ చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇప్పటి నుంచే విజ్ఞానవంతమైన బోధన అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రవీణ్‌బాబు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

వ్యాయామ విద్యకు ప్రాధాన్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేటి ఆధునిక కాలంలో వ్యాయామ విద్యకు ప్రాధాన్యత పెరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో వ్యాయామ విద్య స్టాక్ రిజిస్టర్లను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే వ్యాయామంపై పట్టు సాధిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. చిన్నారుల్లో పెరుగుతున్న ఊబకాయం, బద్ధకం, తదితర సమస్యలకు వ్యాయామం పరిష్కార మార్గమన్నారు. కార్యక్రమంలో తోట సతీష్, హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు

- మూడు రోజుల నుంచి సర్వర్ ప్రాబ్లం..
- ఇబ్బందులు పడిన ప్రజలు


రూరల్ తహసీల్దార్ కార్యాలయం

సిద్దిపేటరూరల్: రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్వర్ రాకపోవడంతో శుక్రవారం ఆయా పనుల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కార్యాలయం ఎదుట పడిగాపులు కాచారు. వివరాలు... భూ భారతి సర్వర్ మూడు రోజులుగా రాకపోవడంతో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆఫీసు వద్దే వేచి చూశారు. గంటల కొద్ది వేచి చూసి విసుగు చెందారు. ఈ విషయమై తహసీల్దార్ రాజేశంను వివరణ కోరగా.. కొద్ది రోజులుగా సర్వర్ రావడం లేదని, ఎప్పుడు వస్తే అప్పుడు ఆలస్యమైనా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్యాంకులో చోరీకి యత్నం


కిటికీ అద్దాలను ధ్వంసం చేసిన దొంగ

నర్సాపూర్: గుర్తు తెలియని దొంగ గురువారం రాత్రి బ్యాంకులో చోరీకి యత్నించాడు. వివరాలు... మండలంలో ఉన్న ఎస్‌బీఐ బ్యాంకు వెనుక భాగంలో బ్రాంచ్ మేనేజర్ క్యాబిన్ ఉంటుంది. క్యాబిన్‌కు చెందిన కిటికీ అద్దాలను దొంగ ధ్వంసం చేశాడు. ఇనుప గ్రిల్స్ గుండా చేయి లోపలికి పెట్టి క్యాబిన్‌లోని టేబుల్ డ్రా ఓపెన్ చేసి కేబుల్ లాగడంతో కంప్యూటర్ కింద పడి పాడైంది. చోరీకి వచ్చిన వ్యక్తి చేసిన పనులన్నీ బ్యాంకుకు చెందిన పలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. బ్యాంకు ఉద్యోగులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.


580 క్వింటాళ్ల అక్రమ బియ్యం పట్టివేత


విచారణ చేస్తున్న విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు

గజ్వేల్: గజ్వేల్‌లో ఉన్న మేడ్చల్ జిల్లా తుర్కపల్లికి చెందిన పౌర సరఫరాల శాఖ గోదాముకు అక్రమంగా వచ్చిన 580 క్వింటాళ్ల బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వర్ రావు కథనం ప్రకారం... తుర్కపల్లికి చెందిన హనుమాన్ రైస్‌మిల్లుకు చెందిన యజమాని సీఎంఆర్ కింద రెండు లారీల్లో 580 క్వింటాళ్ల బియ్యాన్ని గజ్వేల్‌లో ఉన్న తుర్కపల్లి సివిల్ సప్లయ్ గోదాముకు పంపించారు. ఈ బియ్యం అక్రమమని సమాచారివ్వడంతో విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు గజ్వేల్‌కు వచ్చి విచారణ చేపట్టారు. సదరు రైస్‌మిల్లు యజమాని తన రైస్ మిల్లు నుంచి కాకుండా, ఇతర ప్రాంతాల్లో సేకరించి అక్రమంగా తీసుకొచ్చిన రేషన్ బియ్యాన్ని ఇక్కడికి పంపించారని గుర్తించారు. బియ్యం బస్తాలకు పౌరసరఫరాల శాఖ కేటాయించిన సీఎస్‌కే నంబర్లు కూడా పొంతన లేవని నిర్ధారణ కావడంతో, ఇవి అక్రమంగా తీసుకొచ్చిన రేషన్ బియ్యమేనని తేలిపోయింది. ఈ మేరకు సదరు మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయనున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ స్పష్టం చేశారు.

ఆత్మహత్యలు వద్దు.. జీవితాలు ముద్దు

చిన్న చిన్న కారణాలకే బలవన్మరణాలు
- సమస్యలకు చావు పరిష్కారం కాదు
- నేలరాలుతున్న యువతరం
- అవగాహనతో ఆత్మహత్యల నివారణ సాధ్యం



చిన్న చిన్న విషయాలకే జీవితాలను చిదిమేసుకుంటున్నారు. మరి కొంత మంది ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడుతున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలతో భార్యాపిల్లలను రోడ్డు పాలు చేస్తున్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో అనాథలుగా మిగిలిపోతున్నారు. కన్న కలలను సాకారం చేసుకోలేక కన్నవారికి కన్నీళ్లు మిగులుస్తున్నారు.

– జగదేవ్‌పూర్(గజ్వేల్):

మానవ సంబంధాలు దూరమై

సమాజంలో రోజు రోజుకు మానవ సంబంధాలు దూరం అవడం వల్ల మానసిక ఒత్తిడి పెరిగి ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం లాగా ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం, కష్టాలు వస్తే ఓదార్చేవారు లేక, మన అనుకునేవాళ్లు మనోధైర్యం కల్పించకపోవడంతోనే చాలా మంది చిన్న చిన్న విషయాలకే ఆవేశానికి లోనై తనువు చాలిస్తున్నారు. కలల గూడు కట్టుకోలేదనో, పెళ్లి చేయాలనో, నచ్చిన కారు కావాలనో, భార్యకాపురానికి రావడం లేదనో, మద్యం మత్తులోనో..అప్పులు తీర్చలేననో.. ఇలా తీవ్ర మనోవేదనకు గురవుతూ పురుగుల మందు తాగి, ఉరేసుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఒక్క క్షణం ఆలోచిస్తే..

ఆత్మహత్యలకు పాల్పడేవారు 40 ఏళ్ల లోపు భవిష్యత్ ఉన్నవారే. సమస్యలు వచ్చినప్పుడు నలుగురికి చెప్పుకోలేక సతమతమవుతూ క్షణికావేశంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. బతుకుంటే బలుసాకైనా తిని బతుకొచ్చు అన్న పెద్దల మాటను మరిచిపోతున్నారు. కట్టుకున్న భార్యాపిల్లల రేపటి భవిష్యత్ ఏమిటని ఆలోచించకుండా మరణాలను ఆశ్రయిస్తున్నారు. చావుతో సమస్య పరిష్కరం అవుతుందా.. అని వెనుకముందు ఎలాంటి ఆలోచన చేయకుండా చిన్న వయసులోనే దూరం అవుతూ దుఃఖాన్ని మిగులుస్తున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు..

- మండలంలోని చాట్లపల్లి గ్రామానికి చెందిన బొమ్మ కనకయ్య దంపతులది మధ్య తరగతి కుటుంబం . తన కుమారుడు జానీ(21)కి బీఎండబ్ల్యూ ఖరీదైన కారు కోనివ్వలేదని ఈ నెల 1న ఆత్మహత్య చేసుకున్నాడు.
- గత నెల 27న చాట్లపల్లి గ్రామానికి చెందిన గడ్డమీది శిరీష(21) వరకట్నం వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి మృతితో ఏడాదిన్నర పాప అనాథగా మారింది.
- నిర్మల్‌నగర్‌కు చెందిన కర్రె కిరణ్(27) భార్య కాపురానికి రావడం లేదని ఈనెల 8న ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఆత్మహత్యతో ఇద్దరు ఐదేళ్లలోపు కూతుళ్లు ఆగమయ్యారు.
- కొండాపూర్‌కు చెందిన తిగుళ్ల రాజు(37) కౌలు రైతు ఈనెల అప్పుల బాధతో 18న అత్మహత్య చేసుకున్నాడు. భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు అనాథలుగా మిగిలారు. ఇలా మండలంలో నెల వ్యవధిలో వివిధ కారణాల వల్ల 40 ఏళ్ల లోపు ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు. జగదేవ్‌పూర్ మండలంలో 30 నుంచి 40 ఏళ్ల లోపు వారు 2023లో 41 మంది, 2024లో 39 మంది, 2025 ఇప్పటి వరకు 19 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు.



మనోధైర్యం కల్పించాలి

ప్రతి సమస్యకు ఓ పరిష్కారం ఉంటుంది.సమస్యలతో సతమతమవుతున్న వారిని గుర్తించి వారికి మేము ఉన్నామని భరోసా ఇవ్వాలి. అలాగే మనోధైర్యం కల్పించాలి. చిన్న వయసులో మద్యానికి బనిసగా మారకుండా తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండేలా, చెడు వ్యసనాలను మానుకునేలా ప్రోత్సహించాలి. చట్టాలపై అవగాహన పెంచుకోవాలి. మానసిక ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయించుకోవాలి. ఒత్తిడికి గురి కాకుండా జీవనశైలిని మార్చుకోవాలి. ముఖ్యంగా మానవ సంబంధాలు, రక్త సంబంధాలు పెంచుకోవాలి.

– ఎస్‌ఐ చంద్రమోహన్, జగదేవ్‌పూర్

కార్పొరేట్ కోసమే నక్సలైట్ల ఎన్‌కౌంటర్


మహాసభలో మాట్లాడుతున్న ఈటీ నర్సింహ

నర్సాపూర్ రూరల్: కార్పొరేట్ కంపెనీల కోసమే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను ఎన్‌కౌంటర్లు చేసి హతమారుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జి ఈటీ నర్సింహ ఆరోపించారు. శుక్రవారం మండల సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి టీఎం కాలేక్ అధ్యక్షతన జరిగిన మెదక్ జిల్లా పార్టీ 25వ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంతో పాటు కేంద్రంలో కమ్యూనిస్టు పార్టీలతోపాటు ప్రజల కోసం పోరాడే సంస్థలను రూపుమాపేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కమ్యూనిస్టు పార్టీల పోరాటాలతో అనేక ఉద్యోగాలు, సంస్థలను ఏర్పాటు చేసి ప్రజల అభివృద్ధికి పాటుపడిందన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం

మెదక్ జిల్లా సీపీఐ మహాసభల అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా టీఎం కాలేక్, సహాయ కార్యదర్శులుగా రమేష్ గౌడ్, ఖదీర్, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంద పవన్, ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శులు దయానంద్, ప్రకాష్ రావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులు వెంటనే కల్పించాలి


సీఎం సలహాదారుకు ఎస్టీయూ నేతల వినతి


సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ రాష్ట్ర నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): విద్యాశాఖలో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించడంతో పాటు ఎస్జీటీలకు ఎస్ఏలుగా, పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ప్రమోషన్‌లకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10 వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి ఎస్జీటీలకు బీఈడీ, డీఈడీ కామన్ మెరిట్ ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. పండిత అప్‌గ్రెడేషన్ కంటే ముందున్న వెయ్యి ఖాళీలను అర్హత కలిగిన ఎస్జీటీలతో భర్తీ చేయాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ఓటు హక్కును కల్పించాలని కోరారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని నరేందర్‌రెడ్డి హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు అశోక్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గణేష్, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె సత్యం, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

దుబ్బాక నుంచి అరుణాచలానికి బస్సు

జెండా ఊపి ప్రారంభించిన డీఎం


అరుణాచలం బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎం రఘు

దుబ్బాక: దుబ్బాక డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలానికి శుక్రవారం బస్టాండ్‌లో డీఎం రఘు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక డిపో నుంచి అరుణాచలానికి భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతుందన్నారు. ఈ బస్సు 27న సాయంత్రం 4 గంటలకు బయలుదేరి ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకంలో విఘ్నేశ్వరుడి దర్శనం, వేలూర్‌లో మహాలక్ష్మి అమ్మవారు (గోల్డెన్ టెంపుల్), 28న అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. అరుణాచలంలో గిరి ప్రదర్శన, స్వామి వారి దర్శనం అయ్యాక 29న తిరుగు ప్రయాణం అవుతుందని చెప్పారు. వచ్చేటప్పుడు జోగులాంబ అమ్మవారి దర్శనం చేసుకొని 29న రాత్రి దుబ్బాకకు చేరుకుంటుందన్నారు. టిక్కెట్ ధర ఒక్కరికి రూ.4500 ఉందని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్వాన్స్ బుకింగ్ కోసం 99592 26271 లేదా 73828 29973 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక డిపో ఇన్‌చార్జి కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బైక్ దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డపోతారం పట్టణ శివారులో జరిగింది. విలేకరుల సమావేశంలో సీఐ రవీందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఎస్‌ఐ కృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి కిష్టయ్యపల్లి ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఓ ఆటోలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా గడ్డపోతారం వైపు నుంచి కిష్టయ్యపల్లి వైపునకు వెళుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. షేక్ ఫక్రుద్దీన్, మీనంపల్లి జగన్, బోరంపేట రాకేశ్‌గా గుర్తించారు. కాగా వీరిపై దుండిగల్, సూరారం, నర్సాపూర్, బొల్లారం పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు బైక్ చోరీ కేసులు ఉన్నాయి. విచారణలో కొన్ని బైకులను మహమ్మద్ రియాజ్ అనే వ్యక్తికి అమ్మినట్లు, మరికొన్ని అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. 9 బైకులు ఓ ఆటోను స్వాధీనం చేసుకొని నిందితులను సంగారెడ్డి కోర్టుకు తరలించారు. కేసును ఛేదించిన కృష్ణారెడ్డి బృందాన్ని సీఐ రవీందర్ రెడ్డి రివార్డుతో అభినందించారు.

సెంట్రింగ్ డబ్బాలు చోరీ

ఐదుగురు రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్

పటాన్‌చెరు టౌన్: సెంట్రింగ్ డబ్బాల చోరీ కేసులో ఐదుగురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ నరేష్ కేసు వివరాలు వెల్లడించారు. హిమశ్రీ, అదిశ్రీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఆదిత్య ఎవరెస్ట్ ప్రాజెక్ట్ కంపెనీల నిర్మాణాల వద్ద ఈనెల 24వ తేదీన సెంట్రింగ్ డబ్బాలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బొలెరో వాహనంలో వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని కవేలి గ్రామానికి చెందిన అంజలి, కోహీర్‌కు చెందిన నందిని, సదాశివపేటకు చెందిన శాంతమ్మ, అనిత, లింగంపల్లికి చెందిన డ్రైవర్ ప్రసాద్ దర్యాప్తులో సెంట్రింగ్ డబ్బాలను దొంగిలించినట్లు అంగీకరించారు. వారి నుంచి 30 సెంట్రింగ్ బాక్సులు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు. సమావేశంలో ఎస్‌ఐ విజయరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ హాస్టల్ ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న రఘునాథ్ రాథోడ్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌లో ఎస్టీ ఇంటర్ విద్యార్థుల కోసం వసతి గృహం ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే మాణిక్‌రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్ రాథోడ్ మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గంలో 54 గిరిజన తండాలు ఉండగా ఇందులో చాలావరకు పట్టణానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. ఇంటర్, డిగ్రీ చదువుల కోసం 200 మంది విద్యార్థులు ఆయా తండాల నుంచి జహీరాబాద్‌కు వస్తుంటారని చెప్పారు. రవాణ సౌకర్యం లేక రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చాలామంది మధ్యలో చదువులు మానేస్తున్నారని వాపోయారు. అందుకని పట్టణంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థుల కోసం ప్రత్యేంగా ఎస్టీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే మాణిక్‌రావు వారికి హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు జైసింగ్, రాజు, రాజు ప్రేమ్ సింగ్‌లు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం


మల్లేశం

సంగారెడ్డి క్రైమ్: ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం... మోహన్‌పేట్ మండలానికి చెందిన హన్మనోళ్ల మల్లేశం (28), స్వప్న దంపతులు బతుకుదెరువు కోసం మూడునెలల క్రితం వచ్చి సంగారెడ్డి పట్టణంలోని కిందిబజార్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి 8 నెలల బాబు ఉన్నాడు. వృత్తిరీత్యా కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వచ్చిన ఆదాయంతో మల్లేశం నిత్యం మద్యం సేవిస్తుడటంతో తరచుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కోపంతో మే 4న ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి, తిరిగి రాలేదు. చుట్టు ప్రక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఉంది. శుక్రవారం మల్లేశం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే 87126 61830క తెలియజేయాలని సీఐ పేర్కొన్నారు.

మెడికల్ కళాశాల పరిశీలన

వైద్య సేవలపై ఆరా


వివరాలు అడిగి తెలుసుకుంటున్న డైరెక్టర్ షానవాజ్ ఖాసీం

సిద్దిపేటకమాన్: ఏన్సాన్‌పల్లి గ్రామ శివారులోని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలను, అనుబంధ జనరల్ ఆస్పత్రిని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం శుక్రవారం సందర్శించారు. ఈ మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి, సీపీ అనురాధ మొక్కను అందజేసి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షానవాజ్ ఖాసీం మెడికల్ కళాశాల నూతన భవనం, ఓపీ, ఫార్మసీ గది, హాస్టల్ భవనం, లైబ్రరీ, ల్యాబ్, జనరల్ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందుల వివరాల తదితరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో వసతుల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చందర్, అసోసియేట్ ప్రొఫెసర్ దేశం, ఆర్ఎంఓలు జ్యోతి, శ్రావణి, సదానందం, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలమేళా కార్యక్రమం


కార్యక్రమంలో చిన్నారులు, అధికారులు

జోగిపేట(అందోల్): అజీమ్ ప్రేమ్‌జీ, ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం అందోల్‌లోని రంగనాథ స్వామి ఆలయంలో బాలమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగిపేట సీడీపీఓ ప్రియాంక మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీ స్కూల్ పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వారికి ఆట పాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అట్టహాసంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు


పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

సిద్దిపేటజోన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు అట్టహాసంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్ 10, 12, 14 విభాగాల్లో బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో పరుగు, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, షాట్ పుట్, తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను జిల్లా క్రీడల శాఖ అధికారి వెంకట్ నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా సమాఖ్య కన్వీనర్ సాయిరాం, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు శ్రీనివాసులు, రామేశ్వర్ రెడ్డి, అశోక్, రవీందర్ రెడ్డి, వేణు, రాజు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న హెడ్ కానిస్టేబుల్



హుస్నాబాద్: ఒంటరిగా తచ్చాడుతున్న వృద్ధురాలిని చేరదీసి మానవత్వం చాటుకున్నాడు హెడ్ కానిస్టేబుల్ అలీ మహమ్మద్. భీమదేవరపల్లి మండలం కన్నారం గ్రామానికి చెందిన మాచర్ల లచ్చమ్మ తన సెల్‌ఫోన్ పని చేయకపోవడంతో హుస్నాబాద్‌కు వచ్చి షాపుల వద్ద తిరుగుతుంది. విధి నిర్వహణలో ఉన్న హుస్నాబాద్ హెడ్ కానిస్టేబుల్ అలీ మహమ్మద్ గమనించి ఆమె వద్దకు వెళ్లి విషయం తెలుసుకున్నాడు. సెల్ షాపునకు వెళ్లి వృద్ధురాలి సెల్‌ఫోన్‌ను చూపించాడు. జియో ఫోన్ సిమ్ కొత్తది తీసుకోవాలని షాపు అతడు సూచించాడు. వెంటనే కొత్త సిమ్ తీసుకొని దానిని యాక్టివేట్ చేయించాడు. తిరిగి హెడ్ కానిస్టేబుల్ వృద్ధురాలిని కన్నారం ఆటో స్టాండ్ వద్దకు తీసుకొని వెళ్లి ఆటో డ్రైవర్‌తో మాట్లాడి సొంత గ్రామానికి పంపించి మానవత్వం చాటుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన జహీరాబాద్ బైపాస్ రోడ్డులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... కోహీర్ మండలంలోని మాచిరెడ్డిపల్లికి చెందిన మహేష్(28)జహీరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పనులు ముగించుకుని స్కూటర్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో మహేష్ బైపాస్ రోడ్డులో పస్తాపూర్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తీవ్రగాయాలు కావడంతో వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్ఐ.వినయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

జహీరాబాద్ టౌన్: కర్నాటక సరిహద్దులో చెక్‌పోస్టు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. చిరాగ్‌పల్లి ఎస్ఐ. రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం... 50 సంవత్సరాల వయసు కల్గిన వ్యక్తిని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందని, తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచామని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మరో ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అబిద్ 12రోజులుగా కొల్లూరులోని వన్ అండ్ బ్రిక్‌స్టోన్ డెవలపర్ వద్ద పనిచేస్తూ లేబర్‌క్యాంప్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి గదిలో తాగునీరు లేకపోవడంతో కూలీ దీపక్‌ను తీసుకుని నీటిని తెచ్చుకునేందుకు మోటార్‌సైకిల్‌పై సైట్ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ఓ వ్యక్తి బుల్లెట్ బైక్‌పై వేగంతో వచ్చి వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అబిద్, దీపక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని పటాన్‌చెరులోని ఆస్పత్రికి తరలించారు. అబిద్ తండ్రి సలీం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.